క్లుప్తంగా

ఎన్‌ఎంసీలో నో ఉమెన్స్ డే

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ(ఎన్‌ఎంసీ) అధికారులు మహిళా దినోత్సవ వేడుకలను పూర్తిగా విస్మరించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాల్లో మహిళా ఉద్యోగినులు అనేక మంది ఉన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల్లో కూడా అధిక శాతం మంది మహిళలే పని చేస్తున్నారు. దాదాపు వందలాది మంది మహిళలు ఉన్న ఎన్‌ఎంసీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జరపకపోవడం గమనార్హం. గత మూడేళ్లుగా కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించకపోవడం వారి పనితీరుకు నిదర్శనం.

ఉద్యోగిని పర్సు మాయం

నెల్లూరు(అర్బన్) : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన క్రీడా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఓ మెడికల్ ఉద్యోగిని పర్సు మాయమైంది. పర్సులో నగదుతో పాటు ఇంటి తాళాలు, స్కూటర్ తాళాలు, ఇతర క్రెడిట్ కార్డులున్నాయి. విషయం తెలిసిన నాయకులు మైక్‌లో పలుమార్లు అనౌన్స్ చేసి దొరికిన వారు పర్సును ఇవ్వాలని కోరారు. బాధితురాలైన ఉద్యోగిని కూడా తనకు నగదు అవసరం లేదని, ఇంటి తాళాలు, బండి తాళాలు అందేలా చూడాలని పలువురి వద్ద ఏడ్చారు. అయినా పర్సు దొరక్కపోవడంతో ఏడుస్తూ ఇంటిబాట పట్టారు.

965 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు(అర్బన్) : జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా శనివారం ఒక్కరోజులోనే రికార్డు స్థాయిలో 965.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 24 గంటల్లోనే వారి ఖాతాల్లో ధాన్యానికి చెందిన నగదును జమ చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ



నెల్లూరు(బారకాసు) : నగరంలోని 42వ డివిజన్ మెక్లిన్స్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు హంజాహుస్సేని సోదరి పర్వీన్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, పార్టీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి పర్వీన్ మృతదేహానికి శనివారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు మెగా జానపద నృత్య ప్రదర్శన

నెల్లూరురూరల్: గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 2025 మంది విద్యార్థిని, విద్యార్థులతో ఆదివారం మధ్యాహ్నం ఏసీ స్టేడియంలో మెగా జానపద నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు డ్యాన్స్ మాస్టర్ నారాయణమూర్తి తెలిపారు. శనివారం జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పురస్కారం అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నాట్య గురువు పాల జోత్స్నరెడ్డికి ఆదర్శ మహిళా పురస్కారం లభించింది. నెల్లూరు నగరానికి చెందిన ఆమె గత కొన్నేళ్లుగా కూచిపూడి నృత్యంలో విశేష ప్రతిభ కనబరుస్తూ, వందలాది మందికి కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలోని కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారు మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు వర్సిటీలో శనివారం పురస్కారాన్ని ప్రదానం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నేడు

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలో ఆదివారం ఒకేరోజు 105 పనులకు శంకుస్థాపనలు చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

27న మహా ప్రదర్శన

నెల్లూరు సిటీ : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విజయవాడలోని ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ కార్యాలయం ఎదుట 27న మహాప్రదర్శన చేయాలని నిర్ణయించినట్లు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధరరావు అన్నారు. నగరంలోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పలు సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

భూ ఆక్రమణలపై చర్చించాలి

నెల్లూరురూరల్ : దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించారని, దీనిపై అసెంబ్లీలో చర్చించి చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఆక్రమణలపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలే కీలకం

• ఘనంగా మహిళా దినోత్సవం

నెల్లూరు(క్రైమ్) : లింగ వివక్షత లేని సమాజ నిర్మాణానికి పాటుపడాలని, సమాజ నిర్మాణంలో మహిళలే కీలకమని ఎస్పీ జి.కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లు ఉన్నాయని మహిళలు, యువతులు తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ మునిరాజా, నగర, రూరల్, ఎస్‌బీ, ఏఆర్ డీఎస్పీలు పి.సింధు ప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

➡ బీజేపీ నేత మిడతల రమేష్ నగర డీఎస్పీ పి.సింధు ప్రియను ఆమె కార్యాలయంలో కలిసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయదేవత ప్రతిమను అందజేశారు.

➡ నగర డీఎస్పీ కార్యాలయంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది డీఎస్పీ సింధుప్రియను సత్కరించారు.

➡ నెల్లూరు సిటీ : నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా కండక్టర్లు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు, పీఓ రమణ, డిపో మేనేజర్లు శవకేశవ్‌యాదవ్, మురళీకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

➡ ధనలక్ష్మీపురంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా ఉద్యోగులను సత్కరించారు. హెల్త్ సెక్రటరీ మహిత, శానిటేషన్ సెక్రటరీ శిరీష, అంగన్‌వాడీ టీచర్ శారదలకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూర్ భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డీసీసీబీ కార్యాలయంలో బ్యాంకు సీఈఓ శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డులు అందించారు. జీఎం సరిత, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(అర్బన్) : దర్గామిట్టలోని కిమ్స్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా డాక్టర్లు, ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, డీజీఎం శివమాల, మహిళా డాక్టర్లు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల ఉద్యోగినులకు సన్మానం

➡ నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ సుజాత పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీలకు విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్లు ఇందిర, బిజూ రవీంద్రన్ పాల్గొన్నారు.

➡ ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ క్రమంలో దర్గామిట్టలోని ఎన్‌జీఓ హోమ్‌లో విజేతలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. చైర్‌పర్సన్ చిన్నమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుజాత పాల్గొన్నారు.

➡ వేదాయపాళెంలోని గృహనిర్మాణ సంస్థ రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. సీఎల్‌టీసీగా పనిచేస్తున్న వి.సునీతను, డీఈఓగా పనిచేస్తున్న విజయలక్ష్మిలను డీఈఈ మనోజ్‌కుమార్, ఏఈ మంజునాథ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సన్మానించి జ్ఞాపికలను అందచేశారు.

➡ నగరంలోని వీఆర్సీ ఆవరణలో వీఆర్సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు మహిళా కార్మికులు, గృహిణులను సన్మానించారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి రియాజ్ అహ్మద్, క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి, పూర్వ అధ్యక్షుడు నేతాజి సుబ్బారెడ్డి, న్యాయవాది నన్నే సాహెబ్, డాక్టర్లు భాస్కర్‌రావు, పెంచలయ్య, ఈశ్వర రెడ్డి, క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు (పొగతోట) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) సహకారంతో, మహిళా ఉద్యోగుల స్వచ్ఛంద భాగస్వామ్యంతో మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన బస్టాండ్ వద్ద ఉన్న కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో డీఎంహెచ్‌ఓ వి.సుజాత, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ డి.తులసి, జిల్లా అధికారిణి డాక్టర్ ఉమామహేశ్వరి హాజరై పలువురు మహిళలను సత్కరించారు. చైర్‌పర్సన్ సుజాతా బాయి, కన్వీనర్ సువర్ణ కుమారి పాల్గొన్నారు.

➡ నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : మహిళ లేనిదే మనుగడ లేదని, ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని నగర డీఎస్పీ సింధుప్రియ అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని, మహిళా వాకర్స్‌ను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, డిప్యూటీ గవర్నర్ రమాదేవి, మాజీ గవర్నర్ రాఘవేంద్ర శెట్టి తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు విజయనిర్మల ఆధ్వర్యంలో ఫౌండేషన్ రాష్ట్ర సెక్రటరీ మల్లెం విమలమ్మ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. అడ్వొకేట్ కవితారెడ్డి, కంటి వైద్యురాలు హిమబిందు, సచివాలయ మహిళా సంరక్షణాధికారిని శైలజ, ఆర్‌ఎంపీ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

➡ నగరంలోని బండారు ఈశ్వరమ్మ బీసీ భవన్ ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. మహమ్మద్ ఉన్నిసా, ఎస్.దేవసేన, ఎం.మోహన, ఎం.లీలావతి, పి.లక్ష్మిలను సన్మానించి, సావిత్రిబాయి దంపతుల జ్ఞాపికలను అందజేశారు.

కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విట్టపు లలితారామ్, జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు ముత్యంగౌడ్, జిల్లా కార్యదర్శి పిట్టు కృష్ణయ్య పాల్గొన్నారు.

➡ నెల్లూరు(బృందావనం) : పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సభ్యులను పసుపు, కుంకుమ, ఫల, పుష్పాలతో సత్కరించారు. ఐద్వా నాయకురాలు కొండమ్మ, మహిళా కార్యదర్శి వి.హర్షవర్ధిని, ఎస్తేర్‌రాణి మహిళా సాధికారతపై ఉపన్యసించారు.

➡ పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(1938) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పద్మావతి మహిళా వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.జాన్ సుష్మ హాజరై, మాట్లాడారు. విద్యార్థి దశలోనే మహిళా సాధికారతకు సంబంధించి చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ఎం.సులోచనమ్మ, హేమలత, సయ్యద్ ఆరీఫా, మనోజమ్మ, బెల్లంకొండ శ్రీలత, నయోమి తదితరులను సన్మానించారు. ఏపీటీఎఫ్ నాయకురాలు శైలజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలత్రిపుర సుందరి, అఖిలభారత విద్యా సంఘాల సమాఖ్య జాతీయ నేత సుబ్బారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సంగోజు రాజేశ్వరి పాల్గొన్నారు.

➡ నెల్లూరు (టౌన్) : స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ షరీనా, డాక్టర్ అపర్ణ మహిళల సాధికారత, అభివృద్ధిని తెలియజేశారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు రాజమనోహర్, నాయకులు నారాయణరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో బీటీఏ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, పుష్పాంజలి, హెచ్‌ఎం సునంద, ప్రచార కార్యదర్శి చక్రవర్తి, మనోజ్, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాసులు, హజరత్తయ్య పాల్గొన్నారు.

➡ స్థానిక వేదాయపాళెంలోని కార్‌జోన్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శాంతన్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల విజేత తేజశ్రీకి బహుమతి అందజేస్తున్న ఎస్పీ



ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో..



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుజాత



మహిళా వాకర్స్‌తో నగర డీఎస్పీ



జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో..



ఎస్టీయూ ఆధ్వర్యంలో..



డీసీసీబీ కార్యాలయంలో..



కిమ్స్ ఆస్పత్రిలో..



హౌసింగ్ కార్యాలయంలో..

గాండ్ల, తెలికుల కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలి

నెల్లూరు(బృందావనం) : గాండ్ల, తెలికుల సంఘీయుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు నిధులు మంజూరు చేసి తోడ్పాటు అందించాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. నగరంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ దగ్గర ఉన్న దేవి శెట్టి స్వాములు కల్యాణ మండపంలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గాండ్ల, తెలికుల మహిళల ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ పరమైన సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం, కోశాధికారి గార్లదిన్నె నాగరాజు, గౌరవ ముఖ్య సలహాదారు గిద్దలూరు ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు తిరుపతి హరగోపాల్, మహిళా నేతలు ఉప్పులక్ష్మి, పొళెం రామసుబ్బులు, నాగదివ్య, ఉమాదేవి పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న మహిళలతో సంఘ సభ్యులు

‘రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారు’

• న్యాయం చేయాలని ఎఫ్‌ఏల వినతి

నెల్లూరు (పొగతోట) : కొందరు తమను బెదిరిస్తూ రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారని, తమకు న్యాయం జరిగేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఫీల్డు అసిస్టెంట్లు(ఎఫ్‌ఏలు) కోరారు. దగదర్తి మండలానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్లు మాల్యాద్రి, రేవతి, వాణి, పుల్లయ్యలు కలెక్టర్ ఆనంద్‌ను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమపై ఎటువంటి ఆరోపణలు లేకపోయినా విధులకు రానివ్వకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెబ్‌సైట్‌లో తమ పేర్లు ఉన్నప్పటికీ విధులకు తమను హాజరు కానివ్వకుండా కొత్తవారితో పనులు చేయించుకుంటున్నారన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు తమను విధుల్లోకి తీసుకోమని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా, అమలు చేయడం లేదని వాపోయారు. మండలంలో సోషల్ ఆడిట్ జరుగుతుందని, ఆ సమయంలో రూ.లక్షల్లో రికవరీలు వేసి కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన చెందారు. జిల్లా అధికారులు విచారించి తమకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అన్నిరంగాల్లో మహిళలు ముందంజ

నెల్లూరు(బారకాసు) : నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఏపీ వైఎస్సార్ టీఏ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని విజయ మహల్‌గేట్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. తొలుత చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. ఏపీ వైఎస్సార్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జాలిరెడ్డి, ఆపస్మా రాష్ట్ర నాయకుడు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, నాయకులు వాసు, రఘురామిరెడ్డి, మునీర్‌జాన్, శ్రీలత పాల్గొన్నారు.



మహిళను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

గ్రంథాలయాలను కాపాడుకుందాం

నెల్లూరు(అర్బన్) : గ్రంథాలయాలను కాపాడుకునేందుకు ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రహ్మణ్యం, ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ అన్నారు. దర్గామిట్టలోని వెంకటేశ్వర విద్యాలయంలో గ్రంథాలయాభిలాషులతో శనివారం సమావేశం జరిగింది. సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా గ్రంథాలయ పునర్వికాస వేదికను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. నూతన గౌరవాధ్యక్షుడిగా పెరుగు రామకృష్ణ, జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, కో-కన్వీనర్‌గా శ్రీధర్‌బాబు, సభ్యులుగా అంకబాబు, మునీంద్ర, రవికుమార్, డాక్టర్ కరుణశ్రీ, షణ్ముఖం, శ్రీమన్నారాయణలను ఎన్నుకున్నారు.

దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

• చిన్నబజార్ పోలీసులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వినతి

నెల్లూరు(క్రైమ్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన జనసేన నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఆయన యువజన, విద్యార్థి విభాగ నేతలతో కలిసి శనివారం చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ ఈ నెల 5న జనసేన నేతలు గాంధీబొమ్మ సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడేవారు తమ స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, ఆర్యవైశ్య విభాగం నాయకులు చీరాల కిషన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువజన, విద్యార్థి విభాగ నాయకులు

నగరంలో వాకథాన్

నెల్లూరు(అర్బన్) : అపోలో ఆస్పత్రి పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి చిల్డ్రన్ పార్కు మీదుగా అపోలో ఆస్పత్రి వరకు వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి సీఈఓ నవీన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ బాలరాజులు మాట్లాడుతూ నెల్లూరులో 50వ అపోలో ఆస్పత్రిని 2015 మార్చి 8న ప్రారంభించామన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న అపోలో వైద్యులు

రాగి తీగల దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రాగి తీగలను దొంగలించి.. కళ్లుగప్పి తిరుగుతున్న నలుగుర్ని చిన్నబజార్ పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన రమణయ్య, దుర్గారావు, సింహాద్రి, నరసయ్య బంధువులు. బట్వాడిపాళెంలోని టెలికామ్ ఎక్స్ఛేంజ్ నుంచి మూలాపేట వరకు భూగర్భంలో వేసిన రాగి తీగలను ఇటీవల వీరు దొంగలించారు. బీఎస్ఎన్ఎల్ నెల్లూరు సబ్ డివిజనల్ ఇంజినీర్ రామ్మోహన్ ఫిర్యాదు మేరకు కేసును ఈ నెల ఒకటిన నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించి పొట్టేపాళెం వద్ద అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2.5 లక్షల విలువజేసే నగదు, రాగి తీగలను స్వాధీనం చేసుకున్నారు.

ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడిగా షఫీ అహ్మద్

నెల్లూరు రూరల్ : ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా షఫీ అహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక జర్నలిస్ట్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శేషయ్య, షబీర్‌ఖాన్, జుబేర్, మస్తానయ్య, అలీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఈఈ శ్రీధర్ శనివారం తెలిపారు. పినాకినీ అవెన్యూ, ఆకుతోట హరిజనవాడ, సర్వేపల్లి కాలువకట్ట, చిల్డ్రన్స్ పార్క్, అయోధ్య నగర్, మధురానగర్, అపోలో ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయాలు ఉంటాయన్నారు.

రేషన్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

నెల్లూరు(క్రైమ్) : స్థానిక నిర్మలానగర్‌లోని రేషన్ దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. స్టాక్‌లో వ్యత్యాసాలు ఉండడంతో దుకాణంలో ఉన్న రూ.1,25,246 విలువ చేసే 24.50 క్వింటాళ్ల బియ్యం, 194 ప్యాకెట్ల చక్కెరను సీజ్ చేశారు. డీలర్ సుబ్రహ్మణ్యంపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాన్, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఏఈ బి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.